# సంక్రాంతి కానుక

రచయిత: రాచకొండ శ్రీహరి




"వచ్చెవచ్చెను సంక్రాంతి వచ్చెననుచు
పండుగ ప్రయత్నములు జేసికొండంచు
నెల్లకడలను జాటుచు నేగుదెంచె
మాసరాజ్యంబైన పుష్యమాసమంత"

సంక్రాంతి అల్లుళ్లపండుగ. అది మకర మాసంలో వస్తుంది గనుక మకర సంక్రాంతన్నారు మన వాళ్ళు. అది భారతదేశానికంతకీ పర్వదినం. ఆనాడు ఆబాలగోపాలం మహా ఉత్సాహంగా వుంటారు. మనుష్యులకేగాకుండా దేవతలకి అంటే పితృదేవతలకి కూడ సంతోషకరమైన రోజు. పితృదేవతలు దక్షిణాన్ని వుంటారని మన పురాణాలు శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. అంటే ఖగోళశాస్త్రప్రకారం దక్షిణధ్రువం అన్న మాట. మకరసంక్రాంతినాడు ఉత్తరాయణ ప్రయుక్త పుణ్యకాల ప్రవేశం. అప్పుడు సరిగా దక్షిణధ్రువం వాళ్ళకి మధ్యాహ్న మన్నమాట. అంచేతాపూట వారికి భోజనంపెట్టే బాధ్యత మానవానీకంమీద వున్నాది. అందుకనే ఆనాడు హిందువుల్లో అష్టాదశ వర్ణాల వాళ్ళు పెద్దలకి పెట్టుకుంటారు. ఉత్తరాయణప్రయుక్తపుణ్యకాలంలో వుండే మహత్తరార్థం యిది.

ఆ యేడే నాకు పెళ్లయాక పండుక్కి అత్తవారింటికి మొదటిసారి పోవలసిన సమయం. పండుగ నెల్లాళ్ళుందనగానే మా లక్ష్మి పుట్టింటి కెళ్లింది. వెళ్లింది లగాయతు ఉత్తరాలు వర్షిస్తోంది పండుక్కిలాగేనా నన్ను తప్పకుండా రమ్మని. ఆఫీసులో D. O. ల కేనా జవాబు రాయడం అశ్రద్ధ చెయ్యొచ్చును గాని, ఆమె ఉత్తరానికి మాత్రం జవాబు వ్రాయక తప్పదు. అది Home Government. ఆమె కోప మొస్తే అసలుకే మోసం వొస్తుంది. అంచేత ఉత్తరానికి సక్రమమైన జవాబులు రాస్తునే వొస్తున్నాను.

ఇంక పండుగ దగ్గరబడుతుందనగా ఆఫీసర్ని పెర్మిషనడిగేను. ఆయన అలవాటుప్రకారం Refuse చేసేడు, ఆఫీసరు లక్షణాని కాటంకంలేకుండా. నా ఆనందమంతా హతమయిపోయింది. నిజంగా పండుగదినంనాడు పండుగే కాదనిపించొచ్చు ప్రతివారిహృదయంలో ఆనందజ్యోతి తాండవిస్తుంటే నా గుండెలో అంధకారం ఆవరించి వుండడమా? ఇంతకీ నా ఆనందాని కడ్డం తగలడంవల్ల ఆయనకేమైనా ఆనందం ద్విగుణీకృతంగా చేకూరుతుందా? అంటే అదేంలేదే. ఆఫీసులో కొంప మునిగిపొయ్యే పనేం పాసి పోలేదే? ఎందుకీ తిరస్కరణ. ఆయనకాలంలో ఆయన అత్తవారింటికి పండుగనాడు వెళ్ళడం మానేసేడా? ఆయన ఆనందాని కెవరైనా అడ్డొస్తే ఎలాగుంటుందో ఆలోచించుకో అక్కర్లేదు? నాకు మహా కోపమువచ్చింది. హృదయం గట్టిగా స్పందించి ఉడుకురక్తం ఉద్రేకాన్ని ఉబికిస్తోంది. 'ఏంటా అర్ధంలేని ఆవేశం' అని బుద్ధి చివాట్టేసింది. అంతతో ఉద్రేకం అణిగిపోయింది. చీరలు నూరు టంకములుజేసెడి లైనుపెట్టె నుండగా చేరి చినింగిపోగొరుకు లిమ్మట కేమి ఫలంబు" అన్న లెక్క వాళ్ళ ఆఫీసర్లనుకుని ఊరుకున్నాను. పండుక్కి రావడానికి వీల్లేదని లక్ష్మి కో ఉత్తరం రాసిపారేసేను.

లక్ష్మి చక్కనిచుక్క, మృగశాబకం కళ్ళల్లాంటి ఆమెకళ్ళు పెళ్ళిచూపులకి వెళ్లిననాడే నన్నాకర్షించాయి. ఆమె బిత్తరిచూపులు నాకళ్లల్లో ప్రతి ఫలించే యానాడే. లక్ష్మి చామనచాయ పిల్ల. నొక్కునొక్కులుగావుండే ఆమె జుట్టు, ఆ లేడికళ్లు, చంద్రబింబంలాంటి ఆమె మోము గోము, ప్రస్ఫుటమైన సంపూర్ణ యవ్వనంతో తొణికిసలాడే ఆమె అంగ సౌష్టవం, ప్రథమ సమాగమంలోనే నన్ను పూర్తిగా వశం చేసుకున్నాయి. లక్ష్మి నాదగ్గిరలేకపోయేక నాకు పండుగేంటి?

ఆ రోజాదివారం. మనస్సేం బాగులేక సినీమాకి పోదామని బయల్దేరుతున్నాను. సుమారు 3 గంటలయ్యుంటుంది. పోస్టుమేన్ టెలిగ్రామ్ సార్... తీసుకుని సంతకం పెట్టండన్నాడు. నాకు టెలిగ్రామ్ యెక్కడనుంచి వచ్చిందా? అని సందేహిస్తూ సంతకం

చేసి తీసుకొని చించి చూసేను. అది ఎక్స్‌ప్రెస్ టెలిగ్రామ్ చదివేసరికి నాకు ముచ్చెమటలుపోసేయి. లక్ష్మికి చాల జబ్బుగా వుంది రమ్మని టెలిగ్రామ్. మొదలు తెగిన వృక్షంలాగ కుర్చీలో కూలబడ్డాను. శరీరంకంపించిపోయింది. హృదయం వాయువేగంతో కొట్టుకుంటోంది. చేతిలోనుంచి కాయితం కింద పడిపోయింది. కొద్దికాలం కర్తవ్యతా విమూఢుడనై అలా కూచున్నాను. గోడ గడియారం గంటలుకొట్టింది. ఆ సవ్వడికి బాహ్యప్రపంచంలో పడి వాచీ చూసేను నాలుగైంది. అరగంటలో బండివుంది. పక్కనేవున్న తోటిగుమాస్తాకి, టెలిగ్రామ్ Enclose చేస్తూ C L Application రాసిచ్చి, ఆఫీసులో యివ్వమనిచెప్పి, బండికిబయలుదేరేను.

బండిమీద చైతన్యంలేకుండానే ఏదో లాగ రైల్లోపడ్డాను. రైలు తనమామూలు వేగంలోపోతూవున్నా, తక్కువవేగంలో పోతూన్నట్టనిపించింది. రైలుపెట్టె కిటికీ పక్కని కూర్చుని శూన్యదృక్కులతో బయటికి చూస్తున్నాను. రైలుబండి కుదుపుకి చిన్న నిద్దరొచ్చింది. ఆ నిద్దరలో...నే నింటికి చేరుకున్నట్టు బహు ఆతృతతో తలుపుకొట్టినట్టు...లక్ష్మివచ్చి తలుపుతెరచినట్టు...కల. ఆశ్చర్యంగా కళ్ళుతెరచిచూసేను. బండి ఆగింది. అదొక చిన్నస్టేషను. నా పెట్టెలోనే ఒక యువకుడు యిద్దరు ముగ్గురాడవాళ్ళతో యెక్కేడు. సంభాషణనిబట్టి ఆ యువకుడత్తవారింటికి తనతల్లి, చెల్లెళ్ళతో వెళ్తున్నట్టు బోధపడింది. మహా ఉత్సాహంగా సంభాషించుకుంటున్నారు వాళ్ళు. యువకుడు, మహా అదృష్టవంతు డనుకున్నాను నేను,

ఎలాగో యింటికి చేరుకున్నాను. రాత్రి సుమారు 10 గంటలుకావచ్చింది. తలుపు గట్టిగా కొట్టేను. "ఎవరూ" అని లోపలనుంచి కేక. నా చెవులు మా లక్ష్మిగొంతుకని పోల్చేయి. ఛా! కాదు. ఆమెకు సీరియస్‌గావుంటే ఎలా పలుకుతుంది — అది నా భ్రమ.

తలుపు తెరవబడ్డాది, ఎట్టయెదుట లక్ష్మి దివ్యసుందరవిగ్రహం. ఆశ్చర్యముగా, అలంకరించుకొనివుంది. ఆశ్చర్యం! మహాశ్చర్యం!! నాకళ్లు వాటినవి నమ్మలేకుండా వున్నాయి ఎక్స్‌ప్రెస్ టెలిగ్రామ్ చూసినకళ్లు, లక్ష్మికి సీరియస్‌గావుందని చదివిన నాకళ్లు లక్ష్మిని చూస్తూ నివ్వెరపడ్డంలో ఆశ్చర్యంలేదు.

"దయచెయ్యండి! రా నని రాసిన రాజాగారికి స్వాగతం" 'అంది లక్ష్మి కొంటెగా నన్నాహ్వానిస్తూ

'లక్ష్మి! ఎవరిచ్చే రీ టెలిగ్రామ్' అన్నాను నేను.

"ఆఁ! టెలిగ్రామేంటి" అంది లక్ష్మి పెద్దకళ్లుచేసిచూస్తూ ఆశ్చర్యంగా.

నీకు సీరియస్‌గావుందని టెలిగ్రామ్ ఇక్కడనుంచే అన్నాను.

"ఏదీ? యివ్వండి" అంది సందేహంగా లక్ష్మి.

సరే! ఆ సంగతి తరవాత చూదాం. ముందు భోజనానికి లేవండి! చాలా అలసిపోయేరు పాపం! అంది లక్ష్మి జాలిగా.

కాదుమరి! నా మనస్సెంత బాధపడిందో నీకేం తెలుసు నా Position లోను వుంటే...! అని అంటూవుండగానే లక్ష్మి అందుకొని అయ్యో! నాకు మాత్రం తెలియదుటండీ? మీరు రానంటే నే నెంత బాధపడ్డాను అన్నాది లక్ష్మి వికటంగా.

భోజనానంతరం గదిలో కుర్చీలో కూచుని ఎవడిలాంటి పనిజేసేడో నని ఆలోచిస్తున్నాను. అంతలో లక్ష్మి వాలు జడ వయ్యారంగా విసురుకుంటూ కర్పూర తాంబూలంతో హాజరయింది. ఏంటా ఆలోచన? అన్నాది లక్ష్మి నా ముఖంలోకి చూస్తూ.

ఏంలేదు ఈపని ఎవరు చేసేరో అని ఆలోచిస్తున్నాను.

తెలిస్తే వారిని దూషిస్తారా? భూషిస్తారా?

చెప్తూ లెక్కగొడ్తాను!

ఏఁ! మీఁకేఁవఁపకారం జేసేడు?

ఊఁ? మరి ఉపకారమా?

కాదుమరి? మిమ్మల్ని మీ ప్రియురాలిదగ్గిరికి చేర్చాడు.

అమ్మ దొంగా? ఐతే ఈపని నువ్వే జేసేవు.

అయితే నాకు మీరు సంక్రాంతి కానుక యిచ్చుకోవాలి! అంది లక్ష్మి నాకళ్ళలోకి చూస్తూ చిరునవ్వుతో.

తప్పకుండా! అంటూ లక్ష్మిని నా బాహువుల్లో బంధించి, అంకపీఠంమీద కూర్చోబెట్టుకుని, ఆనంద బాష్పాలతో అభిషేకం చేస్తూ, హృదయ సామ్రాజ్యానికి పట్టగట్టి, ఒక్కతియ్య...ప్రసాదించాను.

అనుకూలవతైన భార్యవుంటే సంసారముకంటె వేరేస్వర్గంవుంటుందా? ★


## కస్తూరి మాత్రలు

జలుబు, సాధారణ శీతలముచేత దగ్గులు, జ్వరము, గొంతులో కఠకఠమని యుండుట తల భారము మొదలగువాటిని పోగొట్టును. ఈమాత్రలు బిడ్డలుమొదలు వృద్ధులువరకు ఎంత వయస్సుండినను వాడుకోవచ్చును.

25 మాత్రలు గల బుడ్డి 1-8 రు. 1—00

తపాలా చార్జి రు. 1—12

ధనలక్ష్మి అండ్ కో.,

తపాల్ పెట్టె నెం. 1376, మద్రాసు-1.